# నమస్తే తెలంగాణ
## రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 8 జూలై 2024 | RANGAREDDY





# ప్రభుత్వ జీతం..
# ప్రైవేటు వైద్యం
## వైద్య విధాన పరిషత్ అధికారులు, వైద్యుల తీరిది..

- సొంత క్లినిక్‌లకే పరిమితమవుతున్న ప్రభుత్వ వైద్యులు , అధికారులు
- గవర్నమెంట్ దవాఖానల్లో విధుల బేఖాతరు..
- పర్యవేక్షించి వారించాల్సిన ఓ ఉన్నతాధికారిదీ ఇదే తంతు
- వైద్యులు అందుబాటులో లేక ప్రజలకు తప్పని ఇబ్బందులు

వికారాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానతోపాటు మాతాశిశు, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అధికారులు, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ. లక్షల్లో జీతం తీసుకుంటూ ప్రైవేట్ ప్రాక్టీసుకే పరిమితమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైద్య విధాన పరిషత్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పేదలకు వైద్య సేవలందించాల్సిన వైద్యులు సొంత క్లినిక్‌లకే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలున్నాయి. దీనికి అడ్డుకట్టవేయాల్సిన ఓ ఉన్నతాధికారి కూడా ప్రైవేట్ విధులకే ప్రాధాన్యమివ్వడం గమనార్హం. బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆయన నిత్యం తన సొంత క్లినిక్‌లోనే ఉంటుండడంపై జిల్లావ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన దారిలోనే ప్రభుత్వ ఏరియా దవాఖానల సూపరింటెండెంట్లు, వైద్యులు నడుస్తున్నారని, ప్రభుత్వ వైద్యుల తీరు ప్రైవేట్ దవాఖానలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేలా ఉన్నదని ప్రజలు మండిపడుతున్నారు. వీరిపై ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేసుకొని యథావిధిగా తమ పనులను చేసుకుంటున్నారని.. అలాంటి వైద్యులపై కలెక్టర్ దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నది.

### జిల్లాలో ప్రభుత్వ వైద్యుల తీరే వేరు..

వైద్య విధాన పరిషత్ ఆధీనంలో జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ దవాఖానల సూపరింటెండెంట్లు, వైద్యుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. జిల్లా దవాఖాన సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించే సీనియర్ వైద్యుడిని డీసీహెచ్‌వోగా నియమించాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా మరొకరిని డీసీహెచ్‌వోగా నియమించారు. ప్రభుత్వం నుంచి జీతం పొందుతున్న వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలందించాల్సింది పోయి తమకు చెందిన ప్రైవేట్ క్లినిక్‌ల్లోనే నిత్యం సేవలందిస్తుండడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. తాండూరులో జిల్లా దవాఖానతోపాటు మాతాశిశు సంరక్షణ కేంద్రం, వికారాబాద్, పరిగి, కొడంగల్, మర్పల్లిలో ఏరియా ఆసుపత్రులున్నాయి. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో సూపరింటెండెంట్ ఉండగా.. వీరిందరికీ జిల్లా అధికారిగా డీసీహెచ్‌వో వ్యవహరిస్తారు. ఉన్నతాధికారితోపాటు ప్రభుత్వ ఏరియా దవాఖానల సూపరింటెండెంట్లు కూడా సొంత క్లినిక్‌ల్లోనే సేవలందిస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానలకు వస్తున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందడంలేదని.. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెజార్టీ ప్రభుత్వ వైద్యులు వారానికి ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ దవాఖానల్లో విధులను నిర్వహిస్తూ .. సర్కారు దవాఖానలకొచ్చే రోగులను తాము నిర్వహించే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారని రోగులు చెబుతున్నారు. రోజుకొకరు విధులకు హాజరవుతూ విషయం బయటకు తెలియకుండా జాగ్రత్తపడున్నారనే ఆరోపణలున్నాయి. తాండూరులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రోజుకు ఎనిమిది మంది వైద్యులు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే విధులను నిర్వహిస్తున్నారని.. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రైవేట్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న వైద్యులపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

### వైద్యులు అందుబాటులో ఉండడం లేదు..



కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం విధాన పరిషత్‌కు అనుసంధానం చేయడంతోపాటు 220 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేసింది. గత ప్రభుత్వం నూతన భవనంతోపాటు సకల సౌకర్యాలు కల్పించింది. దీంతో ఈ దవాఖానకు రోగుల రాక పెరిగింది. కానీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. మొత్తం ఏడుగురు వైద్యుల నియామకం జరిగినట్లు అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఉన్నతాధికారులు స్పందించి వైద్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడడంతోపాటు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

-రమేశ్‌బాబు, మాజీ సర్పంచ్, కొడంగల్

### ఒకరిద్దరు మాత్రమే ఉంటున్నారు..



కొడంగల్ దవాఖానలో కేవలం ఒకరిద్దరు డాక్టర్లు మాత్రమే ఉంటున్నారు. రోగుల తాకిడి అధికంగా ఉన్నా.. వైద్యుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం సరిపడా వైద్యులను నియమించినా.. విధులకు హాజరుకావడం లేదు. అనారోగ్యంతో దవాఖానకొస్తే గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉన్నది. ఒక్కోసారి ఒక్క డాక్టర్ మాత్రమే ఉంటున్నారు.. అప్పుడు మరింత ఇబ్బంది అవుతున్నది.

-అంజిలప్ప, ఖాజాఅహ్మద్‌పల్లి, కొడంగల్

### ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సి వస్తున్నది..



సర్కారు దవాఖానలో మధ్యాహ్నం వరకే బయటి రోగులను చూస్తారు. ఆ తర్వాత ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండరు. మధ్యాహ్నం తర్వాత ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ప్రైవేట్ ఆసుపత్రులకే వెళ్లాల్సిందే. సర్కార్ దవాఖానల్లో అన్ని వసతులు ఉన్నప్పటికీ పేదలం పూర్తి స్థాయిలో చికిత్సను పొందలేకపోతున్నాం. రాత్రి వేళల్లో అత్యవసరంగా ఆసుపత్రికి వెళితే సిస్టర్స్ ఇచ్చిన మందులతోనే సరిపెట్టుకోవాలి.

-నర్సప్ప, రుద్రారం, కొడంగల్

---

కసరత్తు చేస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ

# మీ సేవ మరింత చేరువగా..

- గ్రామీణులకు మరింత మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా..
- రంగారెడ్డి జిల్లాలో 46 మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- మహిళా సంఘాలకు బాధ్యతల అప్పగింత
- ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.2.50 లక్షల రుణం అందజేత

రంగారెడ్డి, జూలై 7 (నమస్తే తెలంగాణ) : మీ సేవా కేంద్రాల సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. 'మహిళా శక్తి' పేరుతో ఏర్పాటు చేయనున్న మీ సేవా కేంద్రాల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళ(ఎస్‌హెచ్‌జీ)లకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లాలో కొత్తగా 46 మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. అందుకు అవసరమైన చర్యలను జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కసరత్తు చేస్తున్నది. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను అధికారులు ఎంపిక చేయనున్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ సంబంధిత సేవలు, టికెట్ల రిజర్వేషన్లు, ఉద్యోగ దరఖాస్తులు, చెల్లింపులు సహా 150కి పైగా ప్రభుత్వ, 600లకు పైగా ప్రైవేట్ సేవలను జిల్లాలోని మీ సేవా కేంద్రాలు అందిస్తున్నాయి. అయితే ఈ సేవలను పొందేందుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సి వస్తున్నది. దీనివల్ల వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోనే మీ సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. ఇప్పుడు కొనసాగుతున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే కొత్తగా మహిళా సంఘాలతో ఏర్పాటు కానున్న కేంద్రాల్లో నిర్దేశించిన ఫీజు మేరకు పారదర్శకమైన సేవలను అందించొచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

### రూ.2.50 లక్షలతో కేంద్రం ఏర్పాటు

అయితే ఇప్పటివరకు మీ సేవా కేంద్రాల్లేని ప్రాంతాల్లోనే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం నడుస్తున్న చోట మరో కేంద్రం అవసరమైతే ఆ విషయాన్ని కూడా అధికారులు పరిగణలోకి తీసుకోనున్నారు. అయితే కేంద్రాలను ప్రైవేట్ భవనాల్లో కాకుండా ప్రభుత్వ సంబంధిత భవనాల్లోనే ఏర్పాటు చేయనున్నారు. గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల భవనాలు, కమ్యూనిటీ, యువజన సంఘాలకు చెందిన భవనాలు, రైతువేదికలు వంటివి అనుకూలంగా ఉంటే వాటిల్లో కొత్తగా ఏర్పాటు చేయబోయే మీ సేవా కేంద్రాలను నిర్వహించనున్నారు. కేంద్రం ఏర్పాటుకు సంబంధించి యూనిట్ విలువను రూ.2.50 లక్షలుగా నిర్ధారించారు. ఈ కేంద్రం నిర్వహణకు ఎంపికైన స్వయం సహాయక సభ్యురాలికి గ్రామైక్య సంఘం సిఫారసుతో స్త్రీనిధి ద్వారా రూ.2.50 లక్షల రుణాన్ని మంజూరు చేయనున్నారు. ఈ డబ్బులతోనే కేంద్రం నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, టేబుళ్లు, ఇంటర్‌నెట్ కనెక్షన్ వంటివి సమకూర్చుతారు.




### ఆగస్టు 15 నాటికి ప్రక్రియ పూర్తి..

మహిళా సభ్యుల ఎంపిక, శిక్షణ తదితర ప్రక్రియలను పూర్తి చేసి ఆగస్టు 15 నాటికి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్రాలపై అవగాహన కల్పించేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల్లో మండలానికి ఒకటి, రెండు చొప్పున మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నెలవారీ పొదుపుల ప్రగతి, స్త్రీనిధి బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాల రికవరీ తీరు వంటివి పరిగణలోకి తీసుకుని 'ఏ' గ్రేడ్‌లో ఉన్న సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇంటర్, ఆపై ఎక్కువ చదువుకున్న మహిళలకు ముందుగా కేటాయిస్తారు. ఆసక్తిగల సంఘాల మహిళల నుంచి ఇప్పటికే డీఆర్డీఏ అధికారులకు దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అర్హులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి నెలరోజుల పాటు సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ ఇవ్వనున్నారు.

---



జిల్లాలో 30 మంది

# బాల కార్మికులకు విముక్తి

### వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 7 : ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జిల్లాలో 30 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జూలై 1 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 30 మంది బాల కార్మికులను కాపాడినట్లు చెప్పారు. తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులు, అక్రమ రవాణాకు గురైన వారిని రక్షించి వారికి పునరావాసం కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్-10 ముఖ్య లక్ష్యమన్నారు. జిల్లాలో జూలై 1న ప్రారంభమైన ఈ కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. సబ్‌డివిజన్ల వారీగా లేబర్, ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్, ఎన్జీవోస్, పోలీస్ అధికారులతో కలిపి మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే డయల్ 100 లేదా.. పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 70056కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

---



# ఎల్లమ్మకు తొలి బోనం

## వైభవంగా గోల్కొండ బోనాలు.. కోటకు పోటెత్తిన భక్తులు.. అమ్మవారికి మొక్కుల చెల్లింపు

- లంగర్‌హౌస్‌లో బోనాలను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ
- 501 బోనాలను సమర్పించిన కుమ్మరులు

నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆదివారం గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలి బోనం సమర్పించారు. దీంతో భాగ్యనగరంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత లంగర్‌హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదిక పై నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు చెన్నారెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతరావు, నగర మేయర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ అరవింద్ మహేశ్‌కుమార్‌తో కలిసి బోనాలను ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం తొట్టెలకు కల్లు సాక పోసి .. స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే దానం పోతరాజులతో కలిసి నృత్యాలు చేశారు. అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించారు. సాయంత్రం గోల్కొండ బంజారా దర్వాజా నుంచి కులవృత్తుల సంఘం నాయకులు నజర్ బోనం (సర్కార్ బోనం)ను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అలాగే, తెలంగాణ కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో 501 బోనాలను సమర్పించారు.

-మెహిదీపట్నం, జూలై 7